క్లుప్తంగా

ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ర్యాలీ



దొండపూడిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గోపాలపురం: పెహల్గాంలో ఉగ్రవాదులు దాడులు చేసి అతికిరాతంగా పర్యాటకులను కాల్చి చంపిన దుశ్చర్యకు నిరసనగా గోపాలపురం మండలం దొండపూడిలో బుధవారం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదం నశించాలని, మానవత్వం పరిమళించాలని కోరారు. హెల్పింగ్ హ్యాండ్స్, దొండపూడి వర్తక సంఘం, జాగృతి స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకులకు నివాళులర్పించారు.

ఘనంగా ముగిసిన గోదావరి మేరి మాత ఉత్సవాలు



వేగేశ్వరపురం మేరీమాత ఉత్సవాల్లో దివ్య బలి పూజలో పాల్గొన్న ఫాదర్ జాన్

తాళ్లపూడి: గోదావరి తీరాన మేరీమాత ఆలయం గొప్ప అద్భుతాలకు నిలయంగా మారిందని పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ టి.జాన్ తెలిపారు. వేగేశ్వరపురంలోని నిత్య సహాయ గోదావరి మేరీమాత పుణ్యక్షేత్ర మహోత్సవాలు బుధవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి పరిశుద్ధ జపమాల, సమిష్టి దివ్యబలి పూజ, సువార్త స్వస్థత ప్రార్థనలు, పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ టి.జాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముగింపు ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం సమష్టి దివ్యబలి పూజలో ప్యారిస్ పరిధిలోని ఫాదర్లు పాల్గొన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మేరీమాతకు కానుకలు, చీరలు సమర్పించారు. మరియ తల్లి విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేసారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కొవ్వూరు: పట్టణంలో ఇందిరమ్మ కాలనీ చెందిన భిమ్మిడి రాము (32) కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇంట్లో చున్నీతో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిస అయిన రాము మంగళవారం కుటుంబం సభ్యులతో తగదాపడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరి వేసుకుని మృతి చెందారు. గతంలోను రాము చెదల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అప్పట్లో ఆసుపత్రిలో చికిత్స చేయించడంతో కోలుకున్నాడు. భార్య భిమ్మిడి పోశమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆర్ సత్యనారాయణ తెలిపారు. పోస్టు మార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

గోదావరిలో వ్యక్తి మృతదేహం లభ్యం

కొవ్వూరు: గోదావరిలో బుధవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఔరంగబాద్–2 ఇసుక ర్యాంపులో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40–45 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. మృతదేహాన్ని వెలికి తీసి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు ఆయన తెలిపారు.వివరాల కోసం 94407 96622 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

గోదావరి నదిలో దూకి వ్యక్తి అదృశ్యం

కొవ్వూరు: పట్టణానికి చెందిన కోట్ల సత్యనారాయణ(78) బుధవారం సాయంత్రం రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరి నదిలో దూకి గల్లంతయ్యారు. వంతెనపై అతడు దుస్తులు విడిచిపెట్టి నదిలో దూకినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మృతదేహం కోసం రాత్రి పొద్దుపోయేంత వరకు గాలించారు. ఆయన ఆచూకీ లభ్యం కాలేదు. సత్యనారాయణ ఆత్మహత్యకు దారి తీసిన కారణాలు తెలియరాలేదు.

కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

తాళ్లపూడి: కిశోర్ బాలికల ఆరోగ్యం, మానసిక వికాసంపై ఉపాధ్యాయులతో పాటు, తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ పి మోహనభారతి పేర్కొన్నారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కిషోర వికాసంపై గ్రామస్థాయి కిషోర వికాసం కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భారతి, ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ గ్రామస్థాయి కమిటీల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో కిశోర్ బాలికలతో వారానికి రెండు సార్లు చొప్పున ఆరువారాలు సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. కిశోర్ బాలికలు ప్రవర్తన, తీసుకునే ఆహారాన్ని పరిశీలించి వారికి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సీహెచ్ నెహ్రూజీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యకుమారి, భానుమతి, ఏపీఎం మంగాయమ్మ , కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు, ఏఎస్ఎం, వీవోలు పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతన్నల అవస్థ

- ముమ్మరంగా వరి కోతలు
- డివిజన్‌లో 8,160 హెక్టార్లలో పొలాల్లోనే వరి పైరు
- ఒక వైపు ఈదురు గాలులు... మరోవైపు భారీ వర్షం
- నామమాత్రంగానే ధాన్యం కొనుగోళ్లు



కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఎదుట ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు (ఫైల్)

కొవ్వూరు: అకాల వర్షం కారణంగా రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది. ఒక వైపు డివిజన్‌లో ముమ్మరంగా వరి కోతలు సాగుతున్నాయి. మరోవైపు ధాన్యం కళ్లల్లోనే ఉంది. రైతులు నల్లజర్ల నుంచి కొవ్వూరు వరకు జాతీయ రహదారి, సర్వీసు రోడ్లు పైనే ధాన్యం ఆర బెట్టారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చాలాచోట్ల ధాన్యం రాశులు వర్షానికి తడిసిపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలు మొక్కుబడిగా పనిచేయడంతో రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ధాన్యం అమ్ముకోవడానికి దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని, ఫలితంగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే రూ.300 నుంచి రూ.400 తక్కువ ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ధాన్యం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేశారు. ఈ–క్రాప్ బుకింగ్ అయిన విస్తీర్ణంలో పండిన ధాన్యం అంతటినీ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

రెండు రోజులు నుంచి మారిన వాతావరణం

వర్షానికి తడుస్తున్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడం కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. రైతులు ధాన్యం నిల్వలపై బరకాలు కప్పి ఉంచారు. కొవ్వూరు, దొమ్మేరు, కాపవరంలో భారీ వర్షం కురవడంతో హైవే ఆరబెట్టిన ధాన్యపు రాశులు పూర్తిగా నీటమునిగాయి. ఒక వైపు జోరు వాన కురుస్తున్నప్పటికీ రైతులు లెక్క చేయకుండా ధాన్యం ఒబ్బిడి చేసే పనుల్లోనే నిమగ్నమయ్యారు. వర్షానికి తోడు ఈదురు గాలులు వీస్తుండడంతో పంట నేలవాలి నష్ట తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన రెండు రోజుల నుంచి వాతావరణంలో వచ్చిన మార్పులు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.ఈదురు గాలులకు తోడు వర్షం కురుస్తోంది.బుధవారం ఉదయం 8 గంటలకు, గడిచిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలో నల్లజర్లలో 11.6, తాళ్లపూడిలో 10.2, కొవ్వూరులో 5.8, పెరవలిలో 7.8, దేవరపల్లిలో 2.4, ఉండ్రాజవరంలో 2.2, గోపాలపురంలో 1.0 మిల్లీమీటర్లు చొప్పున వర్షం కురిసింది.



కొవ్వూరులో భారీ వర్షం కారణంగా తడిసిన ధాన్యం

డివిజన్‌లో 2.09 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం

డివిజన్‌లో 33,671 ఎకరాల్లో వరి సాగు చేశారు. దీనిలో 25,510 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి.ఇంకా డివిజన్‌లో 8,160 హెక్టార్లలో పంట కోత కోయాల్సి ఉంది. డివిజన్‌లో ఇప్పటి వరకు 2,09,650 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది.ఈ తరుణంలో వర్షం కురవడంపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు మండలాల్లో తొంభై శాతం కోతలు పూర్తయ్యాయి.పెరవలి మండలంలో 81.1 శాతం పూర్తి చేశారు. డివిజన్‌లో గోపాలపురం, ఉండ్రాజవరం మండలాల్లో 52.4,52.3 శాతం వరి కోతలు పూర్తి చేశారు. నల్లజర్లలో 66.2, తాళ్లపూడిలో 65 శాతం,దేవరపల్లిలో 63.4శాతం వరి కోతలు పూర్తయ్యాయి.

నామమాత్రంగానే ధాన్యం కొనుగోళ్లు

డివిజన్‌లో 123 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.ఇంతరకు ఆశించిన స్థాయిలో ధాన్యం కోనుగోలు చేయలేదు.దీంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లపై పూర్తిస్థాయిలో శ్రద్ధచూపక పోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఈ–క్రాప్ చేసిన అనంతరం ధాన్యం అంతా ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఇంత వరకు కేవలం నలభై శాతం ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోవడం మూలంగా రూ.1,725 బస్తాను రైతు రూ.1,250కే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో ప్రతి రైతు ఎకరాకు రూ.15వేలు నుంచి రూ.20వేలు వరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. లేదంటే రైతులు తరుపున పోరాటం చేస్తాం.

– **తలారి వెంకట్రావు**, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కొవ్వూరు

మధు కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి పరామర్శ



యర్నగూడెంలో మధు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: మండలంలోని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆర్టీసీ బస్సు కండక్టర్, వైఎస్సార్ సీపీ అభిమాని దండే మధు వెంకట మోహన్ ప్రసాద్ కుటుంబ సభ్యులను బుధవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత పరామర్శించారు. మధు వెంకట మోహన్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, నల్లజర్ల మండల అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహ్మణ్యం, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బంకా అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్న వారి వివరాల సేకరణ

తాళ్లపూడి: పోచవరం పంచాయతీ పరిధిలోని రాగోలపల్లిలో ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్న కుటుంబాల వారిని రెవెన్యూ అధికారులు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మోహనభారతి, రెవెన్యూ అధికారులు వివరాలు సేకరించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మోహనభారతి మాట్లాడుతూ గ్రామంలో 25 కుటుంబాల వివరాలు సేకరించామన్నారు.

ధాన్యం రాశులను ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



ధాన్యం రాశులను ఢీకొని తీవ్రంగా గాయపడిన రమేష్



సంఘటన స్థలంలో పడి ఉన్న బైక్

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో యర్నగూడెం శివారు సూర్యనారాయణపురం వద్ద రైతులు ఆరబెట్టిన ధాన్యం రాశులను ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం యర్నగూడేనికి చెందిన వడ్డి రమేష్(నాని) బైక్‌పై వస్తుండగా రాత్రి సమయంలో సర్వీసు రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం రాశులను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రమేష్ తలకు తీవ్ర గాయం కావడంతో, హైవే అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. వారం వ్యవధిలో ధాన్యం రాశులను ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మరణించగా, ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. రాత్రి సమయంలో రోడ్డు ధాన్యాన్ని రాశులుగా వేసి, వాటిపై నల్లని బరకాలు కప్పడం వల్ల ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు.

సామాన్యులు బతికే పరిస్థితులు రాష్ట్రంలో లేవు



చాగల్లు సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణ ఐక్యతగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. చాగల్లులో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గంధ్రోతు సురేంద్రకుమార్ నివాసంలో చాగల్లు వైఎస్సార్ సీపీ నూతన గ్రామ కమిటీ ఎన్నిక సందర్భంగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తలారి వెంకట్రావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ ఘనవి జయం సాధించేలా ఇప్పటి నుంచి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలన్నీ పెరిగిపోయాయని తెలిపారు. పెరిగిన ఖర్చులు భరించలేక ఇప్పటికే ప్రజలు నరకయాతన పడుతున్నారన్నారు. సామాన్యుడు బతికే పరిస్థితులు రాష్ట్రంలో కనిపించడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు జీవనం సాగించేందుకు ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసి అధిక వడ్డీలకు బలవుతున్నారని అన్నారు.

చాగల్లు గ్రామ అధ్యక్షుడిగా బొర్రా రజనీ ప్రసాద్

ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో చాగల్లు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా బొర్రా రజనీప్రసాద్‌ను అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.రజనీ ప్రసాద్‌ను తలారి వెంకట్రావు సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంధ్రోతు సురేంద్రకుమార్ , పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, మండల పార్టీ అధ్యక్షులు మట్టా వెంకట్రావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, పార్టీ జిల్లా ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జాలెం వెంకట్రావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, గేడా శ్యామ్, బొర్రా కృష్ణ, గంధ్రోతు సూర్యనారాయణ, ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యులు ఎస్‌కె పాషా, ఎస్ అర్జునుడు, పిండి మంగరాజు, కందుకూరి శ్యామ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నల్లజర్లలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నల్లజర్ల: పాతికేళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులంతా ఆట పాటలతో అలరించారు. ఒకరినొకరు పలకరించుకున్నారు. గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నల్లజర్ల జెడ్పీహైస్కూలులో 1998–99 పదో తరగతి విద్యార్థులు అదే పాఠశాలలో కలుసుకున్నారు. బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాతికేళ్ల తర్వాత మిత్రులంతా ఒకచోట చేరడంతో ఆ నాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. పూర్వవిద్యార్థులు కలిపిన నీలాసుబ్బారావు, చెల్లు మోజేష్, పాతూరి సురేష్, నరేష్, రాధిక, గోతం దుర్గారావు, సాంబమూర్తిలను అభినందించారు. తమకు చదువు చెప్పిన గురువులు గొట్టిపాటి శ్రీరామ్మూర్తి, దత్తు, ఐడీవీ అప్పారావు, రత్నకుమార్, చంద్రరావు, రాజ్‌కుమార్‌లను ఘనంగా సత్కరించారు. పూర్వవిద్యార్థి రిటైర్డు ఆర్మీ ఉద్యోగి తలంశెట్టి మోహన్‌ను తోటి విద్యార్థులు సత్కరించారు. విశాఖలో సీఆర్‌పీఎఫ్‌లో ఉంటున్న పైడిరాజు, ఏజీ ఆఫీసులో పనిచేస్తున్న వరిది ధనార్జీనాయుడు మాట్లాడుతూ తోటి స్నేహితుల వల్లే ఈ కలయిక సాధ్యమైందని ఆనాటి గురువులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆర్టీసీ డ్రైవర్ నీలం సుబ్బారావు, వీఆర్వో ఆరుగొలను సునీత తదితరులు పాల్గొన్నారు.

చెల్లుబోయినను కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు



రాజమహేంద్రవరంలో చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జక్కంపూడి రాజాను కలిసిన నేతలు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాను రాజమహేంద్రవరంలో బుధవారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బొండాడ వెంకన్నబాబు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు గుర్రాల లక్ష్మణ్, గోపాలపురం నియోజకవర్గ ప్రచార కమిటీ విభాగం అధ్యక్షుడు చిలకా సతీష్, ద్వారకాతిరుమల మండల ముస్లిం మైనార్టీ విభాగం అధ్యక్షుడు అన్సారీ బాషా, పార్టీ నాయకులు రుద్ర సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కమిటీలో తమకు స్థానం కల్పించడంపై వారు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని వారన్నారు.

యువకుడి మృతదేహంతో దళితుల ర్యాలీ





దళిత నాయకులు, అఖిల్ కుటుంబ సభ్యులతో చర్చిస్తున్న రాజమండ్రి క్రైమ్ బ్రాంచ్ సీఐ శ్రీధర్. పోతురాజు అఖిల్ మృతదేహం (అంతర చిత్రం)

నిడదవోలు : రోడ్డు ప్రమాదంలో చికిత్సపొందుతూ మృతి చెందిన యువకుడి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులతో పాటు దళిత సంఘాలకు చెందిన దళితులు బుధవారం రాత్రి ఆందోళన చేపట్టారు. పట్టణంలోని ఇందిరానగర్‌లో నివాసముంటున్న పోతురాజు అప్పారావు, వరలక్ష్మీ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు పోతురాజు అఖిల్ (22) ఇంటర్ వరకు చదువుకొని భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. రెండవ కుమారుడు సువర్ణరాజు ఐటీఐ చదువుతున్నాడు. ఈనెల 27న ఆదివారం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు బొమ్మ సెంటర్‌లో రోడ్డు ప్రమాదం జరిగింది. అఖిల్, సింగవరానికి చెందిన వీరమల్లు నరసింహస్వామి మోటార్‌సైకిళ్లపై ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అఖిల్ తలకు బలమైన గాయం కావడంతో నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం ఈనెల 28న రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఈ నెల 29న కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అఖిల్ మృతి చెందాడు. అఖిల్ మృతదేహాన్ని బంధువులు, స్నేహితులు బుధవారం ఉదయం ఇంద్రనగర్‌లోని ఇంటికి తీసుకువచ్చారు. అయితే ప్రమాద సమయంలో అఖిల్ వైద్య ఖర్చులు భరిస్తామని వీరమల్లు నరసింహ స్వామి అంగీకరించాడు. పోతురాజు అఖిల్‌కు బ్రెయిన్ డెడ్ కావడంతో వైద్య ఖర్చులు భరించలేమని నరసింహస్వామికి చెందిన వారు చెప్పడంతో కుటుంబ సభ్యులు, దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంద్రనగర్ నుంచి అఖిల్ మృతదేహాన్ని వాహనంలో తీసుకుని సింగవరంలోని నరసింహస్వామి ఇంటికి దళితులు ర్యాలీగా బయలుదేరారు. గాంధీనగర్ వద్ద వారిని పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రాజమండ్రి క్రైమ్ బ్రాంచ్ నిడదవోలు ఇన్‌చార్జి సీఐ శ్రీధర్, పట్టణ ఎస్సై జగన్మోహన్ రావు, నిడదవోలు రూరల్ ఎస్సై వీరాబాబు దళిత నాయకులు జువ్వల రాంబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, చిట్టి రామకృష్ణ తదితరులతో పోలీసులు చర్చించారు. అఖిల్‌కు వైద్యం కోసం రూ.2 లక్షలు ఖర్చు చేసినా నా బిడ్డ మాకు దక్కలేదని మృతుడి తల్లి వరలక్ష్మీ కన్నీరు మున్నీరుగా విలపించింది. సీఐ శ్రీధర్ మృతుని కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

గ్రామాల్లో ఫ్లెక్సీలను నిర్దిష్ట సమయంలో తొలగించాలి

దేవరపల్లి: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న రాజకీయ పార్టీల నాయకులు, దేశ నేతల జయంతి, వర్ధంతి సందర్భంగా యువజన సంఘాలు ఏర్పాటు చేస్తున్న వివిధ రకాల ఫ్లెక్సీలను నిర్దిష్ట సమయంలో తొలగించి భద్రపర్చుకోవాలని దేవరపల్లి సీఐ బి.నాగేశ్వర్ నాయక్ సూచించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను దీర్ఘ కాలం ఉంచడం వల్ల వివాదాలు ఏర్పడి శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని ఆయన తెలిపారు. ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన వ్యక్తులు కార్యక్రమం పూర్తయిన వెంటనే తొలగించాలని ఆయన సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు సహకరించాలని ఆయన కోరారు. బస్టాండ్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయవద్దని, దీని వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. మండలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నేరాలను అరికట్టడానికి సర్కిల్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే మండలంలో సుమారు 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు ఆయన వివరించారు. రోడ్డు ప్రమాదాలు, పోలీసుల గస్తీ, శాంతి భద్రతలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎస్సై వి.సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ వై.రాజారావు, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, వీఆర్వోలు, పాల్గొన్నారు.

దొంగతనం, ఫ్లెక్సీల ధ్వంసం కేసులో ఇద్దరి అరెస్టు

పెరవలి: అన్నవరప్పాడులో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రాయ్ జయంతి సందర్భంగా ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చింపివేసి ధ్వంసం చేయడంతో వారిని పెరవలి పోలీసులు అరెస్టు చేసారు. ఎస్సై ఎం వెంకటేశ్వరరావు తెల్పిన వివరాలిలా ఉన్నాయి. అన్నవరప్పాడుకి చెందిన ఆకుల మణికంఠ అయ్యప్ప స్వామి, అడబాల గణపతి ఈనెల 27న దొంగతనం చేసి వచ్చిన సొమ్ముతో మద్యం తాగి ఆ మత్తులో 4 ఫ్లెక్సీలు చింపివేసారని తెలిపారు. కేసు నమోదు చేసి ఈ ఇద్దరు ముద్దాయిలను ఈనెల 29న తణుకు కోర్టులో హాజరుపరిచామని వివరించారు. వారిద్దరూ దొంగతనం, ఫ్లెక్సీల చింపివేసిన ఘటనల్లో ముద్దాయిలుగా ఉన్నారని తెలిపారు.

4 నుంచి కొవ్వూరులో బ్యాడ్మింటన్ శిక్షణ

కొవ్వూరు: పట్టణంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 4 నుంచి 31వ తేదీ వరకు ఉచిత సమ్మర్ కోచింగ్ అందించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పాత్రు మురళీకృష్ణ తెలిపారు. సత్యవతి నగర్‌లో ఉన్న అల్లూరి వెంకటేశ్వరరావు మెమోరియల్ ఇండోర్ మునిసిపల్ స్టేడియంలో ఈ శిక్షణ అందిస్తామని ఆయన తెలిపారు. ఆరు నుంచి 15 ఏళ్లలోపు బాల, బాలికలకు అనుభవజ్ఞులైన కోచ్‌ల ద్వారా శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణా కాలంలో విద్యార్థులకు అల్పాహారం అందిస్తామన్నారు.

ఆధార్ నమోదు కేంద్రాల ఏర్పాటు

తాళ్లపూడి: మండలంలో 6 ఏళ్లలోపు వయస్సున్న చిన్న పిల్లల కోసం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ టీబీ వెంకటరమణ తెలిపారు. పోచవరం అంగన్‌వాడీ కేంద్రంలో మే 5 నుంచి 8 వరకు, గజ్జరం అంగన్‌వాడీ కేంద్రంలో మే 12 నుంచి 15వ తేదీ వరకు ఆధార్ నమోదు చేస్తారని, గ్రామస్తులు దీన్ని వినియోగించుకోవాలని కోరారు.

సమస్యలపై గళమెత్తిన కౌన్సిల్ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి

నిడదవోలు : పట్టణంలోని 22వ వార్డులోని వైఎస్సార్ నగర్‌లో రూ.91.16 లక్షలతో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) భవనంలో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసేందుకు మున్సిపల్ సాధారణ నిధులు రూ.35 లక్షలు కేటాయించడంపై కౌన్సిల్ సభ్యులు కామిశెట్టి వెంకటసత్యనారాయణ, ఎస్‌కే వజీరుద్దీన్‌లు అభ్యంతర వ్యక్తం చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి అధ్యక్షతన బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా ఇన్‌చార్జి చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి సూచన మేరకు జమ్ము కశ్మీర్‌లో పహల్గాం ప్రాంతంలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం కౌన్సిలర్ కామిశెట్టి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనంలో అసంపూర్తిగా ఉన్న పనులు చేపట్టేందుకు వ్యతిరేకం కాదని, మున్సిపల్ సాధారణ నిధులు కేటాయించిన తర్వాత హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ నుంచి నిధులు విడుదలైన తర్వాత తిరిగి మున్సిపల్ సాధారణ నిధులకు రీయింబర్స్‌మెంట్ చేస్తారనే గ్యారెంటీ ఏమిటని ఆయన ప్రశ్నించారు. దీనికి కౌన్సిల్ బాధ్యత వహిస్తుందా అని ప్రశ్నించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. కౌన్సిలర్ ఎస్‌కే వజీరుద్దీన్ మాట్లాడుతూ వైఎస్సార్ నగర్ నుంచి ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనం వరకు మెయిన్ రోడ్డు పనులను చేపట్టాలని కోరారు. వైఎస్సార్‌నగర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సమయంలో వేసిన ముసుగును ఇంత వరకు ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. కౌన్సిలర్ ఆలమూరి భారతి మాట్లాడుతూ పట్టణంలో శిథిలమైన రామ మందిరం నిర్మాణాన్ని ఎప్పుడు పూర్తి చేస్తారని అధికారులను నిలదీశారు. దీనిపై మున్సిపల్ ఏఈ హేమంత్ సమాధానం ఇస్తూ రూ.10 లక్షల నిధులతో నెల రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వెలగడ బాలరాజు మాట్లాడుతూ ఇంద్రనగర్, రాయపేట, బసివిరెడ్డిపేట రాకపోకల గోడ ద్వారాన్ని మూసివేయడాన్ని అడ్డుకున్న పది మందిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఇంద్రనగర్, బసివిరెడ్డిపేట ప్రాంతాలకు వెళ్లేందుకు రైల్వే ట్రాక్ దాటుకుని వెళ్లాల్సి ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి అండర్ గ్రౌండ్ ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మించాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కౌన్సిలర్ దాకే అనిల్‌కుమార్ మాట్లాడుతూ జ్యోతి కాలనీలో వేసవిలో మంచినీటి సరఫరా పూర్తిస్థాయిలో ఉండటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పంట కాలువ పూడ్చివేత తగదు

కొవ్వూరు: నందమూరు రోడ్డు మార్గంలో పశివేదల రోడ్డు జంక్షన్ సమీపంలో పంట కాలువను ఆక్రమించి పూడ్చివేయడానికి నందమూరు గ్రామస్తులు అడ్డుకున్నారు. నందమూరు జంక్షన్ సమీపంలో ఉన్న వట్టికూటి వెంకటేశ్వరరావు అనే రైతు పంట కాలువలో క్వారీ మెటల్‌తో నింపి పూడ్చివేస్తున్నారు. దీంతో బుధవారం మాజీ సర్పంచ్ కంటిపూడి శ్రీనివాసరావుతో పాటు స్థానిక రైతులు పూడ్చివేత పనులను అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి అవినాష్, వీఆర్వో ఎం.పోసిబాబు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ బి.రాజు అక్కడికి చేరుకుని పనులు నిలిపివేశారు.జేసీబీ సాయంతో పూడ్చివేసిన మెటల్‌ను తొలగించారు. ఆక్రమణ కారణం ఏటా ఈ ప్రాంతంలో వర్షపు నీరు దిగువకు వెళ్లడం లేదని రైతులు అన్నారు.